డయల్ యువర్ కమిషనర్ సమయంలో మార్పు

కమిషనర్ ఎన్.మౌర్య

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ప్రతి సోమవారం నగరపాలక సంస్థలో ఉదయం 9.30 నుండి 10.30 గంటల వరకు నిర్వహించే డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం పరిపాలన కారణాల వలన 10.30 నుండి 11.30 గంటల వరకు నిర్వహించనున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక యధావిధిగా నిర్వహిస్తామని తెలిపారు. ఫోన్ ద్వారా పిర్యాదులు చేసేవారు 0877-2227208 కి కాల్ చేసి మాట్లాడవచ్చుని, ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కమీషనర్ కోరారు. అర్జీదారులు వినతిపత్రంతో పాటు ఆధార్ కార్డు జతపరిచి, పనిచేయు ఫోన్ నంబర్లను పొందుపరచాలని తెలిపారు.

వెబ్ కౌన్సిలింగ్ వద్దు.. అయ్యోర్ల అగచాట్లు



జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయుల నిరసన

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఉపాధ్యాయ బదిలీల్లో వెబ్ కౌన్సిలింగ్ తీసుకురావడాన్ని ఉపాధ్యాయ సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. ప్రభుత్వం ఉపాధ్యాయ సంఘాల చర్చల సందర్భంగా బదిలీలు మ్యాన్యువల్‌గా నిర్వహిస్తామని హామీ ఇచ్చి, మాట తప్పిందంటూ ప్రభుత్వ తీరుపై ఉపాధ్యాయులు మండిపడుతున్నారు. అయ్యోర్ల బదిలీల విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉపాధ్యాయ బదిలీలు అయ్యోర్లను ముప్పతిప్పలు పెట్టిస్తోందంటున్నారు. విద్యాసంవత్సరం ప్రారంభం (ఈనెల 12వ తేదీ) దగ్గరపడుతున్న తరుణంలో ఉపాధ్యాయ బదిలీల్లో ఏ ఉపాధ్యాయుడు ఎక్కడి బదిలీ చేస్తున్న విషయం జిల్లా విద్యాశాఖ స్పష్టం చేయకపోవడంతో ఇటు ఉపాధ్యాయులు, అటు విద్యార్థులు ఇబ్బందులకు గురికావాల్సివస్తుంటున్నారు. ఆన్‌లైన్ బదిలీలు నిర్వహించడం వల్ల ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని శనివారం ఆన్‌లైన్ విధానంలో నిర్వహించిన బదిలీల్లో 12మంది ఉపాధ్యాయులే బదిలీ కావడం ఇందుకు నిదర్శనమంటున్నారు. వెబ్‌ఆప్షన్స్‌పై ఉపాధ్యాయుల్లో అపనమ్మకం ఉందంటున్నారు. ఉపాధ్యాయ బదిలీల విషయంలో ప్రభుత్వం అన్యాయం చేయాలని చూస్తే పెద్దఎత్తున్న ఉద్యమిస్తామని హెచ్చరిస్తున్నారు. ఈ మేరకు ఆదివారం మండుటెండను సైతం లెక్కచేయకుండా జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక పిలుపు మేరకు మహిళా ఉపాధ్యాయులు రోడ్డుపై బైటాయించి ఆందోళనకు దిగారు. ప్రభుత్వం మ్యానువల్‌గా బదిలీలు చేపడతామని హామీ ఇచ్చేంత వరకు ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు. భారికేడ్లు, పోలీసు బలగాలతో ఉపాధ్యాయ ఉద్యమాన్ని అణచివేయాలని ప్రభుత్వం ప్రయత్నించినా, ఉపాధ్యాయులు జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి బదిలీల విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును ఎండగట్టారు. వెబ్‌కౌన్సిలింగ్ ద్వారా ఉపాధ్యాయ బదిలీలు నిర్వహిస్తే ఎట్టిపరిస్థితుల్లో సహకరించేది లేదని స్పష్టం చేశారు. ఉపాధ్యాయ సంఘాలతో చర్చించిన అనంతరం బదిలీలు మ్యానువల్‌గా నిర్వహిస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు మాట మార్చి ఆన్‌లైన్‌లో చేపట్టడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

23న ఒలంపిక్ రన్



క్రీడలకు సేవలందించిన ప్రసన్నకుమార్‌ని సన్మానిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ, రామచంద్రాపురం : ఈనెల 23వ తేదీన ఒలంపిక్ డే సందర్భంగా ఒలంపిక్ రన్ నిర్వహించనున్నట్లు జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీధర్ తెలిపారు. చంద్రగిరి మండల, మిట్టపాలెం, శ్రీనివాస హెూటల్‌లో తిరుపతి జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఆదివారం జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎలమంచిలి ప్రవీణ్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీధర్ మాట్లాడుతూ ఈ నెల 23న ఒలంపిక్ డే సందర్భంగా తలపెట్టిన ఒలంపిక్ రన్ జయప్రదం చేయాలని క్రీడా సంఘాల ప్రతినిధులను కోరారు. ఉపాధ్యక్షులు ప్రసన్నకుమార్ మాట్లాడుతూ త్వరలో క్రీడా సంఘాల ఆధ్వర్యంలో ఒక స్పోర్ట్స్ స్కూల్‌ని ప్రారంభిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా 40 సంవత్సరాల నుండి క్రీడలకు సేవలందించిన ప్రసన్నకుమార్‌ని సన్మానించారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి సాయి కుమార్, ఉపాధ్యక్షులు శివ ప్రసాద్, సహ కార్యదర్శి విజయ్ కుమార్, రత్నాకర్, టైక్వాండో సంఘం గోపీనాయుడు, బ్యాడ్మింటన్ సంఘము శివయ్య, రాకెట్ బాల్ సంఘం ప్రేమ్, రోయింగ్ సంఘం శ్రీధర్, రైఫిల్ షుటింగ్ సంఘము హిమత్ తదితరులు పాల్గొన్నారు.

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌పై స్పందించండి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌తో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని, దీనిపై బీసీ సామాజిక వర్గానికి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు చట్టసభలలో గళాన్ని వినిపించాలని ఓబిసి విద్యార్థి సంక్షేమ సంఘం జాతీయ నాయకులు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ వలన విద్యార్థులు ఎందరో మంచి ఫలితాలు సాధించినప్పటికీ, ఉన్నత విద్యకు సంబంధించి ప్రాధాన్యతా క్రమంలో అడ్మిషన్లు పొందలేకున్నారన్నారు. సామాజిక న్యాయం అంటే ఇదేనా అని ప్రశ్నించారు. ఉన్నతిలో ఉన్నవారికి ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను అమలు చేస్తూ పేద విద్యార్థులకు మరింత అన్యాయం చేస్తున్నారన్నారు. ఈడబ్ల్యూఎస్‌పై సరైన నిర్ణయం తీసుకోకపోతే ఓబిసి విద్యార్థి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో ఆందోళన కార్యక్రమాలను చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ అధ్యక్షులు విజయ్ ఉత్తరాది, మహేష్, ధనంజయ్ తదితరులు పాల్గొన్నారు.

షైనింగ్ స్టార్స్ అవార్డుకు ఎంపికైన గిరి పుత్రిక

తులసి

ప్రజాశక్తి -ఏర్పేడు: రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యా రంగంలో నాణ్యత, ప్రతిభను ప్రోత్సహించేందుకు కొత్తగా షైనింగ్ స్టార్స్ అనే పథకాన్ని ప్రవేశపెట్టింది. పల్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతిలో 540 మార్కులు సాధించిన గిరి పుత్రిక తులసి ప్రతిభ అవార్డుకు ఎంపికైంది. ఆ బాలిక ఎంపిక పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆనంద్, ఉపాధ్యాయులు, విద్యార్థిని తల్లిదండ్రులు, ప్రగతి సంస్థ డైరెక్టర్ కెవి రమణ, సంస్థ సమన్వయకర్తలు చంద్రశేఖర్, శిరీషలు హర్షం వ్యక్తం చేశారు.

షైనింగ్ స్టార్స్ అవార్డ్‌కు ఎంపికైన ఏర్పేడు మండల విద్యార్థులు

2024-25 విద్యా సంవత్సరంలో ఎస్ఎస్‌సి పబ్లిక్ పరీక్షలలో అత్యధిక మార్కులు సాధించిన బాపూజీ విద్యా సదన్ పాఠశాలకు చెందిన 6 మంది విద్యార్థులు రెడ్డివారి జ్ఞానశ్రీ (582), వెంకటగిరి అభిష్ (578), రావిళ్ళ మహిమ (578), రెడ్డివారి ప్రతాపరెడ్డి (589), నందలూరి ముజాహిత్ (589), బొందా రితిక(570), జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పల్లం గ్రామానికి చెందిన మూండ్ తులసి (540) ఏడు మంది విద్యార్థులు ఏర్పేడు మండలం నుండి షైనింగ్ స్టార్స్ అవార్డ్‌కు ఎంపికైనట్లు మండల విద్యాశాఖాధికారులు ప్రేమలత, దయాకర్ తెలిపారు. జూన్ 9 న తిరుపతి మహతి ఆడిటోరియంలో రెవెన్యూ శాఖా మంత్రి, తిరుపతి జిల్లా ఇన్‌చార్జ్ అనగాని సత్యప్రసాద్ చేతుల మీదుగా అవార్డ్‌కు ఎంపికైన విద్యార్థులకు ఇరవై వేల రూపాయల నగదు బహుమతి, మెడల్, సర్టిఫికెట్ అందజేయబడుతుందని తెలిపారు. షైనింగ్ స్టార్స్ అవార్డ్‌కు ఎంపికైన విద్యార్థులకు, అందుకు కృషి చేసిన ఉపాధ్యాయ బృందానికి అభినందనలు తెలిపారు.

ఈ ఏపీ సెట్ ఫలితాల్లో జిల్లా విద్యార్థుల ప్రతిభ

శ్రీధర్ అకాడమీ విజయదుందభి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : తిరుపతి ఎ.ఐ.ఆర్. బైపాస్ రోడ్, శ్రీధర్స్ అకాడమీ విద్యార్థులు ఈఏపీసెట్-2025 ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించినట్లు కళాశాల ఛైర్మన్ మద్దినేని శ్రీధర్ తెలిపారు. ఇంజనీరింగ్, అగ్రికల్చర్‌లో వి. మోహిష్ 228 ర్యాంకు, కే. సాయి పార్థీవ్ 737 ర్యాంకు, పి.నిఖిలేశ్వర్ 1365 ర్యాంకు, ఎస్.పెన్నిధి 3919 ర్యాంకు, వి.అమృత-4414 ర్యాంక్, అలాగే ఎపి ఈఏపీసెట్ పరీక్షకు హాజరైన 110 మంది విద్యార్థులుకు గాను 10 వేల ర్యాంకు లోపు 25 మంది సాధించారని తెలిపారు.ఈ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఛైర్మన్ మద్దినేని శ్రీధర్ అభినందనలు తెలియచేశారు.

బి.వి.కె జూనియల్ కాలేజి సంచలనం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఆదివారం విడుదల చేసిన ఎపి ఈఏపీసెట్ (ఇంజినీరింగ్) 2025 ఫలితాలలో తిరుపతిలోని అమరావతి ఐఐటి అకాడమీలో యంపిసి. విభాగం రాష్ట్ర స్థాయిలో బి.అరుణ్ కుమార్ రెడ్డి 125వ ర్యాంకు, వి.కెయూష్ సాయి 731వ ర్యాంక్,పి.రూత్విక్ 751 ర్యాంక్, కె.సంతోష్ 799 ర్యాంక్, టి.వంశీకృష్ణ 960వ ర్యాంకులు సాధించారు. రాష్ట్రస్థాయిలో 1000 లోపు 5 ర్యాంకులు,2000 లోపు 40 ర్యాంకులు,3000 లోపు 70 ర్యాంకులు సాధించారని ఛైర్మెన్ బివి కృష్ణారెడ్డి తెలిపారు. ఇంత ఉన్నత స్థానం సాధించడం ఎంతో ముదావహమని, ఈ విజయాలు సాధించడానికి దోహదపడిన అధ్యాపకులకు, అధ్యాపకేతర సిబ్బందికి, విద్యార్థుల తల్లిదండ్రులకు కళాశాల ఛైర్మెన్ బి.వి.కృష్ణారెడ్డి, వైస్ ఛైర్మెన్ పార్థీవ్ రెడ్డి విలేకరుల సమావేశంలో కృతజ్ఞతలు తెలియజేసినారు.

నారాయణ ప్రభంజనం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : ఏపీ ఈఏపి సెట్ -2025 ఫలితాలలో నారాయణ విద్యాసంస్థల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించారని ఆ విద్యా సంస్థల డిజిఎం కొండలరావు తెలిపారు. స్థానిక నారాయణ కళాశాలలో ఆదివారం నిర్వహించిన మీడీయా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ విభాగంలో మాండవ్యపురం భానుచరణ్ రెడ్డి 2వ ర్యాంకు, మణిదీప్ రెడ్డి 7వ ర్యాంకు, ధనుష్ 59వ ర్యాంకు, యశ్విత 69 ర్యాంక్ వంటి అత్యుత్తమ ర్యాంకులతో మొదటి పది లోపు రెండు, మొదటి 100 లోపు నాలుగు, ఐదు వందలలోపు14, వెయ్యి లోపు 21 అత్యుత్తమ ర్యాంకులు సాధించారని, బైపీసీ విభాగంలో మౌనిక 94 వ ర్యాంకుతోపాటు, మొదటి వెయ్యి లోపు తొమ్మిది ర్యాంకులు సాధించారని తెలిపారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను కోర్ డీన్ శ్రీనివాస రావు, డీన్ వేణుగోపాల్,ప్రిన్సిపాల్ సురేష్, అధ్యాపకులు విజయ్ కుమార్,చిట్టిబాబు, దుర్గా ప్రసాద్, అభిషేక్, ఏజిఎం గోపి అభినందించారు.

శ్రీకాళహస్తి విద్యార్థికి స్టేట్ రెండో ర్యాంక్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం విడుదల చేసిన ఎపి ఈఏపీసెట్ ఫలితాల్లో శ్రీకాళహస్తికి చెందిన రాయలసీమ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ మాండవ్యపురం జయభారత్ కుమారుడు మాండవ్యపురం భాను చరణ్ రెడ్డి స్టేట్ రెండో ర్యాంకు సాధించారు. భానుచరణ్ రెడ్డికి జేఈఈ అడ్వాన్సులో ఓపెన్ కేటగిరిలో 51వ ర్యాంకు, జేఈఈ మెయిన్స్ ఓపెన్ కేటగిరిలో 158, జేఈఈ బీఆర్క్ ఓపెన్ కేటగిరిలో 54వ ర్యాంకు సాధించాడు. భానుచరణ్ మాట్లాడుతూ ఐఐటి బాంబేలో కంప్యూటర్ సైన్స్ తీసుకొని క్వాంటం కంప్యూటర్స్‌ను డెవలప్ చేయడం తన లక్ష్యమని తెలియజేశారు. ఈ విజయానికి సహకరించిన తల్లిదండ్రులకు తిరుపతి నారాయణ జూనియర్ కళాశాల అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

శ్రీచైతన్య విజయభేరి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : ఎపి ఈఎపిసెట్ ఫలితాలలో శ్రీచైతన్య విద్యార్థులు ఇంజనీరింగ్, అగ్రికల్చర్, రెండు విభాగాలలో రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించి విజయకేతనం ఎగురవేశారు. అరుష్ లక్ష్మణ్ 45, యశ్వంత్ 135, లావణ్య 230, లక్ష్మి సహస్ర 322, జశ్విత 398, కే జశ్విత 444, వై శివ కృతిక 492, హర్షవర్ధన్ 528 ఎం ఉమేష్ 551, ఎం హిమవర్ష 787, సి రామలక్ష్మమ్మ 799, వి లక్ష్మి హర్షిత 800,కె మంజునాథ మహర్షి 900, కె టీనారాణి 919, వి సాధన 925 వంటి 1000 ర్యాంకులు సాధించడంతో పాటుగా 167 మంది విద్యార్థులు 5000 లోపు ర్యాంకులు, 348 మంది విద్యార్థులు 10 వేల లోపు ర్యాంకులు సాధించి అగ్ర పదాన నిలిచారు. ఇంతటి అద్భుత విజయాలకు కారణం,అధ్యాపకుల సమిష్టి కృషితో పాటుగా ఉత్తమ ఆబ్జెక్టివ్ మెటీరియల్స్,విద్యార్థుల అకుంఠత దీక్షలే కారణం అని డైరెక్టర్స్ సుష్మశ్రీ, నాగేంద్రలు తెలియజేశారు. ఈ సందర్భంగా అత్యుత్తమ ర్యాంకులు సాదించిన విద్యార్థులను, అద్యాపకులను శ్రీచైతన్య తిరుపతి శాఖ ఎ.జి.యం.బి.వి. ప్రసాద్, అలాగే డీన్లు కె.యల్.జి. ప్రసాద్,రామ్మోహన్ రావు, శ్రీనివాసరాజు, భాస్కర్లతో పాటు ప్రిన్సిపాల్స్ అభినందించారు.

వీధి దీపాలకు 'మంగళం..!'

- అంధకారంలో మంగళం ప్రధాన రహదారి మార్గం
- ఏడాది కావస్తున్న వెలగని వీధి దీపాలు
- ప్రయాణికుల అవస్థలపై స్పందించని అధికారులు
- బిల్లుల చెల్లింపులో టీటీడీ జాప్యం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): నిత్యం వేలాది వాహనాలు సంచరించే మార్గమది. సుదూర ప్రాంతాల నుండి ప్రాణాలు నిలుపుకోవడానికి తిరుపతిలో ఉన్న హాస్పిటల్స్‌కు వచ్చే ప్రధాన మార్గం. ఒకప్పుడు బండిబాట. నేడు రాష్ట్ర రహదారి. ఇలా రూపాంతరం చెంది, అభివృద్ధి చెందినా కూడా మంగళం ప్రాంతం నుండి కరకంబాడి వరకు రహదారి వెంబడి విద్యుత్ దీపాలు లేకుండా ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. విద్యుత్తు దీపాలు లేకుండా రోడ్డు దాటే క్రమంలో ఎంతోమంది ప్రాణాలు కోల్పోయిన పరిస్థితులు నమోదయ్యాయి. ఇదే కాకుండా రోడ్డు దాటుతున్న మూగజీవాలు... వాటిని గుర్తించకుండా ఎన్నో రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోవటం... గాయాల పాలవడం జరిగిన సందర్భాలు అనేకం ఉన్నాయి. తిరుపతి నుండి తెలంగాణ రాష్ట్రానికి ఎక్కువగా వినియోగించే మార్గం తిరుపతి-కరకంబాడి మార్గం. తిరుపతి నుండి నగరపాలక సంస్థ పరిధి వరకు రహదారి వెంబడి విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. గత ఏడాది జూన్ మాసంలో మంగళం పరిధి వెంకటేశ్వర కాలనీ నుండి కరకంబాడి వరకు 6.5 కిలోమీటర్ల మేర విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయడానికి పనులు ప్రారంభమయ్యాయి. పనులు ప్రారంభమై నేటికి ఏడాది గడుస్తున్నా ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు అలంకారప్రాయంగానే మిగిలిపోయాయి. మంగళం ఆశ కన్వెన్షన్ సెంటర్‌లో ఇటీవల జరిగిన టెంపుల్ కన్వెన్షన్ కార్యక్రమం మూడు రోజులపాటు సాగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రితో పాటుగా జాతీయస్థాయిలో ప్రజా ప్రతినిధులు, ముఖ్య అతిథులు రావడంతో ఆ మూడు రోజులు పాటు మాత్రమే అలంకారప్రాయంగా మిగిలిన రహదారి విద్యుత్ దీపాలు వెలిగాయి. అటు తరువాత ఎవరి నిర్లక్ష్యమో కానీ నేటి వరకు వెలగడం లేదు.

సైన్స్ కాంగ్రెస్ నిర్వహణ సమయంలో..

బయట ప్రాంతాల నుండి తిరుపతి ఆధ్యాత్మిక క్షేత్రానికి వేలాదిగా వచ్చే ప్రయాణికుల సౌకర్యార్థం తిరుపతి-కరకంబాడి మార్గాన్ని సుందరంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం సంకల్పించింది. ప్రతిష్టాత్మకమైన సైన్స్ కాంగ్రెస్ కార్యక్రమాన్ని తిరుపతిలో నిర్వహించడానికి ఆమోదం లభించడంతో తిరుపతి-కరకంబాడి మార్గంలో రహదారి వెంబడి పూల మొక్కల ఏర్పాటు, బస్సు షెల్టర్లను నిర్మించారు. సైన్స్ కాంగ్రెస్ జరిగే శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం వేదిక వరకు తిరుపతి నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. యుద్ధ ప్రాతిపదికన జరిగిన ఈ సుందరీకరణ పనులతో తిరుపతి కరకంబాడి మార్గం నూతన శోభను సంతరించుకుంది.

అనేక ప్రమాదాలు..

మంగళం పరిధిలోని పంచాయతీల కాలనీలకు ఆనుకుని ఉన్న తిరుపతి-కరకంబాడి మార్గంపైకి ప్రజలు వచ్చి రోడ్డు ప్రమాదాలకు గురైన సందర్భాలు అనేక ఉన్నాయి. కొంతమంది ఈ రోడ్డు ప్రమాదాలలో ప్రాణాలు సైతం కోల్పోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మంగళం ప్రధాన రహదారి మార్గంలో విద్యుత్ దీపాలను వెలిగేలా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

టీటీడీ నిర్లక్ష్యం..

తిరుపతి-కరకంబాడి మార్గంలోని మంగళం వెంకటేశ్వర కాలనీ నుండి కరకంబాడి వరకు టిటిడి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రహదారి విద్యుత్ దీపాలు వెలుగులు చిందించక పోవడానికి టిటిడి అధికారుల నిర్లక్ష్యం కారణంగా తెలుస్తోంది. రహదారి వెంబడి ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలకు సంబంధించి విద్యుత్ శాఖకు నగదు చెల్లింపులలో జాప్యం కారణంగా మంగళం ప్రధాన రహదారి వెంబడి ఉన్న విద్యుత్ దీపాలు వెలగడం లేదని స్థానిక ప్రజలు విమర్శిస్తున్నారు. ఈ మార్గంలో వేలాదిమంది శ్రీవారి భక్తులు తమ వాహనాలలో, కాలినడకగా కూడా తిరుమలకు వస్తుంటారు. శ్రీవారి భక్తుల పట్ల తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు వ్యవహరిస్తున్న తీరు పలు విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా టిటిడి అధికారులు స్పందించి విద్యుత్ శాఖకు చెల్లించాల్సిన నగదును చెల్లించగలిగితే మంగళం ప్రధాన రహదారి వెంబడి ఏర్పాటుచేసిన విద్యుత్తు దీపాలు వెలగనున్నాయి.

> **డిమాండ్ నోటీసు ఇచ్చాం..**
>
> తిరుపతి-కరకంబాడి మార్గం మంగళం వెంకటేశ్వర కాలనీ నుండి కరకంబాడి వరకు టిటిడి ఏర్పాటు చేసిన రహదారి విద్యుత్ దీపాలకు సంబంధించిన బిల్లులకు సంబంధించి టిటిడి వారికి ఇప్పటికే డిమాండ్ నోటీసులు ఇచ్చాం. మీటర్లను కూడా ఏర్పాటు చేశాం. అయితే టీటీడీ అధికారులే ఆ మీటర్లకు తాళాలు వేసుకున్నారు. నగదు చెల్లింపులు జరిగితే విద్యుత్ సరఫరాను ఇవ్వగలం.
>
> **- మోహన్, ఏఈ, మంగళం సబ్ స్టేషన్**

సహకార బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఛైర్మన్ అమాస రాజశేఖర్

ముఖా ముఖి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లా సహకార బ్యాంకు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఇటీవల జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఛైర్మన్ పదవీ బాధ్యతలు స్వీకరించిన అమాస రాజశేఖర్ రెడ్డి తెలిపారు. చిత్తూరు జిల్లా సహకార బ్యాంకును దక్షిణ భారత దేశంలోనే అగ్రభాగంలో నిలిపి చిత్తూరు సహకార కేంద్ర బ్యాంకు ఖ్యాతిని పెంచిన అమాస రాజశేఖర్ రెడ్డి మూడవసారి ఛైర్మన్ బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ప్రజాశక్తి ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు.

ప్రజాశక్తి: గతంలో రెండుసార్లు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఛైర్మన్‌గా పనిచేశారు. మూడోసారి పదవీ బాధ్యతలు చేపట్టాక బ్యాంకు అభివృద్ధికి ఎలా కృషి చేయనున్నారు..?

డిసిసిబి ఛైర్మన్: గతంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా పనిచేసిన కాలంలో నాకు జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ఛైర్మన్‌గా అవకాశం కల్పించడం జరిగింది. అనంతరం తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక నారా చంద్రబాబు నాయుడు డిసిసిబి ఛైర్మన్‌గా నన్ను ఎంపిక చేశారు. తరువాత తెలుగుదేశం పార్టీ ఓడిపోవడంతో కొంతకాలం రాజకీయాలకు దూరంగానే ఉంటూ తెలుగుదేశం పార్టీ అభివృద్ధి కోసం కృషి చేయడం జరిగింది. తిరిగి తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాపై అపార నమ్మకంతో నాకు డిసిసిబి ఛైర్మన్ పదవీ బాధ్యతలను అప్పగించారు.

ప్రజాశక్తి: జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ఛైర్మన్‌గా ఉన్న కాలంలో బ్యాంకు అభివృద్ధికి ఎలాంటి చర్యలు చేపట్టారు....?

డిసిసిబి ఛైర్మన్: మొదటిసారి డిసిసిబి ఛైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన నాటికి ఉమ్మడి చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఖాతాదారులు 26,000 మంది మాత్రమే ఉండేవాళ్లు. నేను బాధ్యతలు చేపట్టిన తర్వాత ఏడున్నర లక్షల ఖాతాదారుల సంఖ్యను పెంచడం జరిగింది. ఎంతోమంది అనుభవజ్ఞుల సలహాలు సూచనలతో బ్యాంకును లాభాల్లోకి తీసుకువచ్చి అనేక మంది రైతులకు బ్యాంకు నిబంధనలకు అనుగుణంగా వ్యవసాయ, ఇతర వాణిజ్య రుణాలు అందించడం జరిగింది. ప్రతి బ్యాంకుకు తమ ఖాతాదారులే బలం.

ప్రజాశక్తి: బ్యాంకు అభివృద్ధి కోసం ప్రజలకు ఎలాంటి సూచనలు చేస్తున్నారు..?

డిసిసిబి ఛైర్మన్: ముఖ్యంగా జిల్లాలోని ప్రజలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకును మన బ్యాంకుగా భావించాలి, ఈ బ్యాంకు మన కోసం స్థాపించిందనే విషయాన్ని ఎప్పుడూ గుర్తు పెట్టుకోవాలి. సమీపంలోని సహకార కేంద్ర బ్యాంకు బ్రాంచ్‌లకు వెళ్లి తమకు అవసరమైన రుణాలను పొందాలి.

ప్రజాశక్తి: గత పాలకవర్గంపై అనేక అవినీతి ఆరోపణలు ఉన్నాయి. వీటిని ఎలా పరిష్కరిస్తారు...?

డిసిసిబి ఛైర్మన్: గత పాలకవర్గంపై అనేక అవినీతి ఆరోపణలు రావడం వాస్తవమే. ఈ ఆరోపణలపై ఏడుగురు ఎమ్మెల్యేలతో రాష్ట్ర ప్రభుత్వం విచారణ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ విచారణ కమిటీలో పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథరెడ్డి సభ్యులుగా ఉన్నారు. అవినీతి విషయాన్ని కమిటీ నిగ్గు తేలుస్తుంది.

ప్రజాశక్తి: జిల్లా సహకార బ్యాంకు వ్యవహారాలు ఎలా ఉంటాయి...?

డిసిసిబి ఛైర్మన్: ఛైర్మన్ బాధ్యత అత్యంత కీలకమైనప్పటికీ 21మంది పాలకవర్గ సభ్యులు ఉంటారు. బ్యాంకుకు సంబంధించిన ప్రతి విషయాన్ని పాలకవర్గ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటించాల్సి ఉంటుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అపార నమ్మకంతో డిసిసిబి ఛైర్మన్ బాధ్యతలను మరోసారి నాకు అప్పగించడం జరిగింది. తెలుగుదేశం పాలనలో ప్రతి విషయంపై నిఘా అనేది ఉంటాది. బాధ్యతలు ఇచ్చే ముందు సమర్థతను దృష్టిలో ఉంచుకొని బాధ్యతలను అప్పగిస్తారు.

కార్మికుల భద్రత గాల్లో దీపం

- ప్రమాదకర ప్రయాణం.. ప్రాణాలతో చెలగాటం
- నిత్యం ఆటోల్లో విధులకు వెళుతున్న కార్మికులు
- పరిమితికి మించి ఆటోల్లో కుక్కుతున్న వైనం
- ఆటోవాలాల మధ్య అనారోగ్యకరమైన పోటీ
- అధికారుల, పరిశ్రమల యాజమానుల నిర్లక్ష్యం

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ, వరదయ్యపాలెం ప్రాంతాల నుంచి వందల సంఖ్యలో రోజువారీగా పరిశ్రమలకు వెళ్లే కార్మికులు ఆటోల్లో ప్రయాణిస్తుంటారు. అయితే ఆటో డ్రైవర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ప్రయాణీకుల భద్రత గాలికొదిలేస్తున్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఆటోల్లో ఎక్కించుకుని, మితిమీరిన వేగంతో ఒకరికొకరు పోటీపడుతూ ప్రయాణీకుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. పోలీసులు పదే పదే హెచ్చరిస్తున్నా ఆటో డ్రైవర్లు భద్రత ప్రమాణాలను పాటించడం లేదు. వీటిని నియంత్రించాల్సిన రవాణా, పోలీసు అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. ఏదైన అనుకోని ఘటన జరగక ముందే అధికారులు మేల్కోవాల్సిన అవసరం ఉంది. కోట్ల రూపాయల పెట్టుబడులతో పరిశ్రమలు స్థాపనకు పెట్టుబడిదారులు ముందుకొస్తారు. ఈ నేపథ్యంలో కార్మికుల కష్టంతో ఆ పరిశ్రమ అభివృద్ధి దిశలో పయనిస్తుంది. అంతటి కీలకంగా వ్యవహరించే కార్మికుల భద్రత గురించి పరిశ్రమల యాజమాన్యాలు ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారని కార్మిక సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. ప్రధానంగా ఆటు శ్రీసిటీ పరిశ్రమలకు, ఇటు చిన్న పాండూరు సమీపంలోని ఏపీఐఐసీ పరిధిలో ఏర్పాటైన పరిశ్రమలకు, తడ సమీపంలోని అపాచీ, ఇతర పరిశ్రమలకు ముఖ్యంగా బుచ్చినాయుడు కండ్రిగ, వరదయ్యపాళెం, సత్యవేడు, చిన్న పాండూరు ప్రాంతాల నుంచి వందల ఆటోల ద్వారా కార్మికులు రోజువారీ విధులకు వెళ్తుంటారు. అయితే ఆటోలలో వెనుక భాగంలో సైతం మహిళా కార్మికులు ప్రయాణి స్తుంటారు. ఆటో వెనుక భాగంలో కాళ్ల వేలాడదీ సుకుని మరీ భద్రతా ప్రమాణాలను ఏ మాత్రం లెక్క చేయకుండా ఆటో డ్రైవర్లు పరిమితికి మించి మహిళలను కూడా ఎక్కించుకుంటున్నారు. ఈ ఆటో వాలాలు అతివేగంగా రోడ్లపై హల్చల్ చూస్తూ.. మా ఆటో ఎక్కండంటే.. మా ఆటో ఎక్కండని ప్రయాణీకులను పోటాపోటీగా పంచుకుంటున్నారు. ఆటోలలో వెళ్లే కార్మికులు కుటుంబ పోషణ నిమిత్తం వ్యయ ప్రయాసలకోర్చి రోజువారీ కూలీలు గాను, నెలసరి ఉద్యోగులుగాను కుటుంబ పోషణ కోసం వెళ్తుంటారు. అలాంటి పరిస్థితుల్లో వారి భద్రత గురించి అటు పరిశ్రమలు గానీ, ఇటు ప్రభుత్వ యంత్రాంగం గానీ ఆలోచన చేయకపో వడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కార్మికుల భద్రత నిర్లక్ష్యం చేయొద్దని కార్మిక సంఘాల నాయకులు పరిశ్రమల యాజమాన్యాలను హెచ్చరిస్తున్నారు. భద్రత ప్రమాణాలతో కూడిన బస్సులను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఇప్పటికైనా పరిశ్రమ యాజమాన్యాలు ఆ దిశగా ఆలోచన చేయాల్సిన పరిస్థితి ఎంతైనా ఉంది.

నేడు ముద్దు కృష్ణమనాయుడు జయంతి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మాజీమంత్రి స్వర్గీయ గాలి ముద్దు కృష్ణమనాయుడు జయంతి సందర్భంగా సోమవారం ఉదయం 11గంటలకు పుత్తూరు అన్న క్యాంటీన్ వద్ద నందమూరి తారకరామారావు, మాజీ మంత్రి గాలి ముద్దుకృష్ణమనాయుడు విగ్రహాలను శాసనసభ్యులు గాలి భానుప్రకాష్ ఆవిష్కరిస్తారని, టీడీపీ పట్టణ అధ్యక్ష గాలి జీవరత్నం నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎస్ఎన్ ధనపాల్, రూరల్ అధ్యక్షులు ఏ బాలాజీ, ప్రధాన కార్యదర్శి వెంకటేష్‌లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజలు, అధికారులు, పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

యోగాతో శారీరక, మానసిక ఉల్లాసం

యోగా చేస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్

ప్రజాశక్తి - గూడూరు టౌన్: యోగాతో మానసిక, శరీరక ఉల్లాసం పెరుగుతుందని యోగాంధ్ర కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొనాలని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ పిలుపునిచ్చారు. గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో యోగ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్, వాకర్స్, ప్రజలు యోగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, నాయకులు పులిమి శ్రీనివాసులు, రహీం శివకుమార్, కట్ట మురళీకృష్ణ, రాజా తదితరులు పాల్గొన్నారు.

వధూవరులకు ఎమ్మెల్యే ఆశీర్వాదం

గుమ్మిడిపూడి ఎమ్మెల్యే కుమారుడి వివాహంలో ఎమ్మెల్యే ఆదిమూలం

ప్రజాశక్తి - పిచ్చాటూరు: తమిళనాడు, గుమ్మిడిపూడి ఎమ్మెల్యే కుమారుడి వివాహం ఆదివారం చెన్నైలో జరిగింది. ఈ వివాహ వేడుకకు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా గుమ్మిడిపూడి ఎమ్మెల్యే ఆదిమూలంకి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట మాజీ ఏఎంసీ చైర్మన్ ఇలంగోవన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

విశ్వంలో ఉచిత సైనిక్, నవోదయ ప్రవేశ పరీక్షలపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి స్థానిక వరదరాజ నగర్, విశ్వం విద్యా సంస్థలో ఈ నెల 10వ తారీఖున ఉదయం 10:00 గంటలకు ఉచిత సైనిక్, నవోదయ ప్రవేశ పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఎన్. విశ్వనాథరెడ్డి తెలిపారు. 4 నుండి 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరు కావచ్చని తెలిపారు. ఈ అవగాహన సదస్సుకు ఎలాంటి ప్రవేశ రుసుము చెల్లించనవసరం లేదన్నారు. మరిన్ని వివరాల కోసం 8688888802 / 03, 9399976999 ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చన్నారు.

జగన్ మహిళలకు క్షమాపణ చెప్పాలి



వన్ టౌన్ సీఐకి ఎమ్మెల్యే బొజ్జల సతీమణి రిషితా రెడ్డి వినతి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : తన సొంత టీవీలో జర్నలిస్టుల చేత అమరావతి మహిళల పట్ల అసభ్యకర వ్యాఖ్యలు చేయించిన జగన్ మహిళా లోకానికి బహిరంగ క్షమాపణలు చెప్పాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి సతీమణి బొజ్జల రిషిత రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఆమె ఆ వ్యాఖ్యలకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. మహిళా లోకాన్ని అవమాన పరిచేలా వ్యాఖ్యలు చేసిన వారిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని వన్ టౌన్ సీఐకి ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు తెలుగు మహిళలు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - రామచంద్రపురం మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని, ఆరోగ్య సంరక్షణకు ఆహార జాగ్రత్తలను పాటించాలని రాయలసీమ సేవ సమితి సంఘం ఉపాధ్యక్షులు కప్పా గోగ్రాజు అన్నారు. రామచంద్రపురం మండలంలోని పివి పురం పంచాయతీ, బలిజపల్లిలో తిరుపతికి చెందిన అస్సర్ నారాయణాద్రి హాస్పిటల్, వాసవి ఐ కేర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. డాక్టర్ రాజలక్ష్మి తో పాటు పలువురు వైద్య బృందం వంద మందికి పలు రకాల వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాజేష్, నాగేశ్వరరావు, ఉమాపతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

మనీష్ కుమార్ సింగ్‌కు సన్మానం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : అఖిల భారత క్షత్రియ మహాసభ - 1897 యువ విభాగం జాతీయ అధ్యక్షులు మనీష్ కుమార్ సింగ్ ను ఆంధ్రప్రదేశ్ అఖిల భారత క్షత్రియ మహాసభ అధ్యక్షులు చంద్రశేఖర్ రాజు కోనేటి రవిరాజు, ఏపీ యువ విభాగం అధ్యక్షులు బాలసుబ్రమణ్యం రాజు, రాయలసీమ విభాగం కోశాధికారి, రాష్ట్రీయ హిందూ వాహిని సంఘటన రాష్ట్ర అధికార ప్రతినిధి గుండ్రాజు సుకుమార్ రాజు, వాణిజ్య వర్గం పుత్తూరు సన్మానించారు. శ్రీవారి దర్శనార్థం తిరుపతికి విచ్చేసిన ఆయనను స్థానిక క్షత్రియ సోదరులు కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా మనీష్ కుమార్ సింగ్ మాట్లాడుతూ క్షత్రియ సంతతి పెరగాల్సిన అవసరం ఉందన్నారు. తర్వాత జాతీయస్థాయిలో క్షత్రియులు సంఘాలను ఏకీయంలో నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత క్షత్రియ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

జాతీయ రహదారి స్థలం కబ్జా..!

- పట్టించుకోని.. ఎన్‌హెచ్ అధికారులు
- 48 గంటల్లో షెడ్డు నిర్మాణం పూర్తి



ప్రజాశక్తి - రామచంద్రపురం (చంద్రగిరి) నాయుడు పేట-పూతలపట్టు జాతీయ రహదారిలో చంద్రగిరి నాగాలమ్మ జంక్షన్ వద్ద ఫ్లైఓవర్ పక్కనున్న సర్వీస్ రోడ్డుకు సంబంధించిన స్థలం కబ్జాచేసి, అక్రమ నిర్మాణాలు చురుకుగా సాగించేశారు. చంద్రగిరి నాగాలమ్మ ప్రధాన కూడలి వద్ద ఫ్లైఓవర్ కింద భాగంలో, తిరుపతికి వెళ్లే సర్వీస్ రోడ్డు పక్కన డ్రైనేజీ కాలువ నిర్మాణం చేశారు. కాలువ ప్రక్కనే ఉన్న జాతీయ రహదారికి సంబంధించిన స్థలాన్ని, కాలువను ఆక్రమించుకుని గత కొంతకాలంగా టిఫిన్ సెంటర్ నిర్వహించారు. జాతీయ రహదారి నిర్మాణ సమయంలో ప్రక్కనున్న పెద్ద భవనం వరకు భూసేకరణ చేసి ఆ రైతుకు నష్టపరిహారం కూడా చెల్లించారు. కానీ ప్రధాన కూడలిలో మలుపు వద్ద స్థలం ఖాళీగా కనిపించడంతో కబ్జా చేసేసారు. గత రెండు రోజులుగా ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు కావడంతో అధికారులు కన్నెత్తి చూడరనే ధీమాతో షెడ్ నిర్మాణం చక చకా చేసేశారు. విద్యుత్ స్తంభాలను కూడా గోడలో కలుపుకొని 48 గంటల్లో నిర్మాణాన్ని పూర్తి చేశారు. బెంగళూరు, చిత్తూరు, కాణిపాకం, వేలూరు, పలమనేరు, మదనపల్లి ప్రాంతాల నుండి వచ్చే ఆర్టీసీ, ప్రైవేటు బస్సులు ఆ సర్వీస్ రూట్లో తిరుపతికి వెళ్లాల్సి ఉంటుంది. అక్కడే బస్సులు ఆగుతాయి. చంద్రగిరి టౌన్‌లో ఆ సర్వీస్ రోడ్‌లో తిరుపతికి వెళ్లేందుకు కార్లు, జీపులు, లారీలు వస్తుంటాయి. ఈ షెడ్డు నిర్మాణం వల్ల సర్వీస్ రోడ్డు ఇరుకై ప్రమాదాలు సంభవించే పరిస్థితి నెలకొంది. షెడ్డులో టిఫిన్ సెంటర్ ఏర్పాటు చేస్తే ద్విచక్ర వాహనాలు కూడా రోడు పైనే వాహనాలు పార్కింగ్ చేస్తారు. దీంతో వాహనాల రాకపోకలు, ప్రమాదాలు సంభవించే పరిస్థితి ఉందని స్థానికులు పేర్కొన్నారు. ఇకనైనా నేషనల్ హైవే అధికారులు, రెవెన్యూ అధికారులు స్పందించి జాతీయ రహదారి సర్వీస్ రోడ్డు స్థలంలో నిర్మాణాలను తొలగించాలని వాహన చోదకులు, స్థానిక ప్రజలు కోరుతున్నారు.

మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నాయుడుపేట: ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ మానవత్వంతో ప్రమాదానికి గురైన దంపతులను రక్షించి హాస్పిటల్లో చేర్పించి ప్రజలపై సమాజంపైన ఆమెకున్న బాధ్యతను నిరూపించుకున్నారు. వివరాల్లోకి వెళితే రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఒక మహిళను, ఆమె భర్తను హాస్పిటల్‌కు తరలించిన సంఘటన ఆదివారం సూళ్లూరుపేట న్యాయం నియోజకవర్గం నాయుడుపేట పట్టణంలోని విన్నమాల వద్ద చోటు చేసుకుంది. చిల్లకూరు మండలంలోని బూధనం గ్రామానికి చెందిన సొంగా భవాని, రాజశేఖర్ దంపతులు శ్రీకాళహస్తికి వెళ్లి వస్తుండగా, నాయుడుపేట పట్టణ సమీపంలోని విన్నమాల వద్ద ప్రమాదవశాత్తు డివైడర్ను ఢీకొని బైకు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బైక్ పై వెళుతున్న భార్యాభర్తలకు గాయాలయ్యాయి. అదే సమయంలో నాయుడుపేట నుండి సూళ్లూరుపేటకు వెళుతున్న ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ బైక్ ప్రమాదాన్ని గమనించి వెంటనే స్పందించి క్షతగాత్రుల వద్దకు వెళ్లి పరామర్శించి, చికిత్స నిమిత్తం వారిని డీఎస్పీ వాహనంలో నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వారికి మెరుగైన వైద్యం అందించాలని స్థానిక ప్రభుత్వాసుపత్రి డాక్టర్లతో స్వయంగా మాట్లాడారు.

మా స్థలంలో కట్టడాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

మాట్లాడుతున్న బాధితుడు శంకర

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మా స్థలంలో దౌర్జన్యంగా కట్టడాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని తిరుపతి అగ్రహారం గ్రామానికి చెందిన జి.శంకర జిల్లా ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేరూరు గ్రామపంచాయతీ రెవెన్యూ లెక్క దాఖలాలో సర్వేనెంబర్ 529/4ఏలో 1962లో తన తండ్రి జి.యర్రయ్య పేరుపై డికెటి పట్టా మంజూరు అయ్యిందన్నారు. ఆనాటి నుండి తమ స్వాధీన అనుభవంలో ఉన్న స్థలం తన తండ్రి మరణానంతరం భాగ పరిష్కారాలలో ఆలస్యమైందన్నారు. కానీ మాకు పట్టా ద్వారా మంజూరు కాబడ్డ భూమి 22ఏ లో ఉండడంతో హైకోర్టును ఆశ్రయించి స్టే పొందామన్నారు. శనివారం సుబ్రహ్మణ్యం నాయుడు, నాగరాజు, వెంకటేష్ మరి కొంతమంది దౌర్జన్యంగా మా స్థలంలో ప్రవేశించి నిర్మాణాలు చేయడానికి ప్రయత్నించారని తెలిపారు. హుటాహుటిన స్థలం వద్దకు వెళ్లి పోలీసులకు సమాచారం అందించమన్నారు. పోలీసులు ఇరువురిని స్టేషన్‌కు రావాలని చెప్పారన్నారు. అయినా కూడా యధేచ్ఛగా నిర్మాణాలు చేస్తూనే ఉన్నారని, నిర్మాణాలు చేస్తున్న వారిపై పోలీసు ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకొని, న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

ముక్కంటి సేవలో రిజర్వ్ బ్యాంక్ డిప్యూటీ గవర్నర్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రిజర్వు బ్యాంకు డిప్యూటీ గవర్నర్ రవిశంకర్ ఆదివారం కుటుంబ సమేతంగా స్థానిక శ్రీకాళహస్తీశ్వరాలయానికి విచ్చేశారు. వీరికి ఆలయాధికారులు సాంప్రదాయ స్వాగతం పలికి దర్శనం ఏర్పాట్లు చేశారు. స్వామీ, అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేత పండితులు ఆశీర్వచనాలు పలికి ముక్కంటి తీర్థప్రసాదాలు, జ్ఞాపికలు అందజేశారు.

సూర్యప్రభ, చంద్రప్రభ వాహనాలపై ఊరేగిన గోవిందరాజస్వామి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : తిరుపతి శ్రీ గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాల్లో ఏడో రోజైన ఆదివారం ఉదయం గోవిందరాజస్వామి సూర్యప్రభ వాహనంపై, రాత్రి చంద్రప్రభ వాహనంపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఈ వాహన సేవలో పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, ఆలయ డెప్యూటి ఈవో శాంతి, ఏఈవో మునికృష్ణారెడ్డి, ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పూడింది.. పరిశుభ్రత యాడుంది..?

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మున్సిపాలిటీ పరిధి, గేట్ పుత్తూరు 6వ వార్డు, జెండా మాను సమీపంలో అనంబట్టు రోడ్డు వద్ద డ్రైనేజీ కాలువల ద్వారా వెళుతున్న మురికి నీరు పొంగి రోడ్డుపై ప్రవహిస్తోంది. పట్టించుకునే నాధుడు లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. వారంలో రెండు మూడు రోజులు ఇదే తంతుగా జరుగుతుందని, స్థానిక వార్డు ప్రజలు మున్సిపాలిటీ పారిశుద్ధ్య కార్మికులకు పలుమార్లు తెలియజేశారు. వారు స్పందించలేదని అధికారులకు విన్నవించుకున్నారు. అయితే సంబంధిత అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టకుండా నిర్లక్ష్య ధోరణ వ్యవహరిస్తున్నారు. ఈ మురుగు నీటితో దోమలు వృద్ధి చెంది మలేరియా, డెంగ్యూ వంటి విష జ్వరాలతో బాధపడుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించిన తగు చర్యలు చేపట్టాలని కోరారు.

డ్రైనేజీలో పేరుకున్న చెత్త

రోడ్డుపై పారుతున్న మురికి నీరు

గత వారం రోజులుగా చెత్త పేరుకు పోయి రోడ్డుపై మురికి నీరు పారుతున్నా ఎవరు పట్టించుకోవడం లేదు. పారిశుద్ధ్య కార్మికులు ఈ సమస్యకు పరిష్కారం చూడాలి. దుర్వాసనేకాక, దోమల బెడతతో వార్డు ప్రజలు రోగాలకు గురవుతున్నారు.

- రాజేంద్ర, ఆరో వార్డు, గేటు పుత్తూరు

ఈ సమస్య నా దృష్టికి రాలేదు, సిబ్బందిని పంపి వెంటనే డ్రైనేజీ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం.

- మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ

క్రైం న్యూస్

ఎర్రచందనం దుంగలు స్వాధీనం.. స్మగ్లర్ల అరెస్టు

స్మగ్లర్ల అరెస్టును చూపుతున్న టాస్క్ ఫోర్స్ పోలీసులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శేషాచలం అటవీ పరిధి,అన్నమయ్య జిల్లా, తంబళ్లపల్లి అటవీ ప్రాంతంలో 48 ఎర్రచందనం దుంగలతో సహా నలుగురు స్మగ్లర్లను, ఒక మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్ ఫోర్స్ పోలీసులు తెలిపారు. టాస్క్ ఫోర్స్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆర్ఐ చిరంజీవులు ఆధీనంలోని ఆర్ఎస్ఐ మురళీధర్ రెడ్డి బృందం శనివారం అన్నమయ్య జిల్లా బురకాయల కోట అటవీ ప్రాంతంలో స్థానిక అటవీశాఖ అధికారులు జయప్రసాదరావు, మోహన్ రెడ్డి, షబీన్ తాజ్ రసాకారంతో వేపూరి కోట ఫారెస్ట్ బీట్ పరిధిలో డంపింగ్ పాయింట్ల తనిఖీలు చేపట్టరన్నారు. ఆదివారం తెల్లవారుజామున అన్నగారి పల్లి సమీపంలో వంక గట్టు వద్ద ఒక మోటార్ సైకిల్ కనిపించిందని, దానిని సమీపిస్తుండడంతో ఆ ప్రాంతానికి కొంత దూరంలో కొంతమంది గుమికూడి ఉన్నారని టాస్క్ ఫోర్స్ సిబ్బందిని చూసి పారిపోయే ప్రయత్నం చేశారన్నారు. పారిపోతున్న వారిని వెంబడించి నలుగురు స్మగ్లర్లను అదుపులోకి తీసుకుందామన్నారు. పట్టుబడ్డ నలుగురు అన్నమయ్య జిల్లాకు సంబంధించిన వారుగా గుర్తించామన్నారు. దీనిపై టాస్క్ ఫోర్స్ పోలీస్ స్టేషన్‌లో సిఐ సురేష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యువతకు క్రీడా సామగ్రి పంపిణీ

క్రికెట్ కిట్‌ను స్థానికంగా ఉన్న యువతకు అందిస్తున్న అశోక్ కుమార్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం పరిధి, రణధీరపురం గ్రామ పంచాయతీ యువత క్రీడల పట్ల రాణించాలని ఉద్దేశంతో టిడిపి గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శి కల్లూరి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో క్రికెట్ కిట్‌ను స్థానికంగా ఉన్న యువతకు అందించారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, శాప్ చైర్మన్ రవినాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ క్రీడాకారులకు మంచి ప్రోత్సాహకాలను అందించడానికి స్పోర్ట్స్ కాంప్లెక్స్ లను అభివృద్ధి చేస్తున్నారని అశోక్ కుమార్ తెలిపారు.

ధర్మరాజుల బ్రహ్మోత్సవాల్లో ఎమ్మెల్సీ

ప్రజాశక్తి -ఏర్పేడు: మండలంలోని పాత వీరాపురం గ్రామంలో జరుగుతున్న ద్రౌపతి ధర్మరాజుల ఉత్సవాల్లో భాగంగా ఆదివారం జరిగిన అగ్నిగుండ మహోత్సవానికి ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం వచ్చేశారు. ఆలయ ధర్మకర్తల మండలి వారికి ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేసి సన్మానించారు. ఈ ఉత్సవాల్లో ఎమ్మెల్సీ తన వైద్య సిబ్బందితో ఆలయ ప్రాంగణంలో మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మంజుల, ఎక్స్ జెడ్పిటిసి ముని రంగారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, ఆలయ పూజారి రవి, ఎక్స్ ఎంపీటీసీ మునిరత్నం రెడ్డి, బండారుపల్లి ముని కృష్ణారెడ్డి, కొంగర దాము, హరిదాస్ రెడ్డి, కావాలి బాలాజీ, మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ కృషి సంకల్ప అభయాన్‌తో రైతు సాధికారత

ప్రజాశక్తి - రామచంద్రాపురం (చంద్రగిరి) రైతు సాధికారత కోసం వికసిత్ కృషి సంకల్ప అభియాన్ నిర్వహించినట్లు శాస్త్రవేత్త సుధాకర్ తెలిపారు. ఆదివారం కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో చంద్రగిరి, కొంగరవారిపల్లి, ఐతేపల్లి గ్రామాల్లో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త సుధాకర్ మాట్లాడుతూ రానున్న ఖరీఫ్ సీజన్ దృష్టిలో ఉంచుకొని పంట సాగులో ఆధునిక శాస్త్రీయతపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. వివిధ వ్యవసాయ ఆధునిక మెలకువలను రైతులకు వివరించారు. క్రీడా శాస్త్రవేత్త భరత్ కుమార్ మాట్లాడుతూ వ్యవసాయం లాభసాటిగా వుండాలంటే నాణ్యమైన విత్తనం వినియోగించాలన్నారు. వ్యవసాయ అధికారి శశిధర్ రెడ్డి మాట్లాడుతూ సబ్సిడీ అందుబాటులో ఉన్న పథకాలు వివరించారు. ఈ కార్యక్రమంలో భరత్ కుమార్, క్రీడా శాస్త్రవేత్త, హైదరాబాద్, శశిధర్ రెడ్డి, వ్యవసాయ అధికారి, డి ఆర్ సి, తిరుపతి, ఉద్యాన సహాయకురాలు పవిత్ర, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : ఆర్యవైశ్యుల అభివృద్ధికి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువనాయకులు లోకేష్ లకే దక్కిందన్నారు. ఆర్యవైశ్య సంఘం 14వ సర్వసభ్య సమావేశం కచ్చపి ఆడిటోరియంలో ఆదివారం సాయంత్రం జరిగింది. ఆర్యవైశ్యులు తమ ఆదాయంలో కొంత సమాజసేవకు ఉపయోగిస్తున్న తీరు అభినందనీయమని ఎమ్మెల్యే అన్నారు. ఆర్యవైశ్యులు తమలో ఒకడిగా తనను ఆదిరిస్తున్నారని ఆయన తెలిపారు. రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండీ రాఖేష్ మాట్లాడతూ గత ప్రభుత్వం ఆర్యవైశ్యులను అన్ని రకాల ఇబ్బందులకు గురి చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు దుండుకుర్తి నరసింహులు, కార్యదర్శి శ్రీదర్, కోశాధికారి హేమచంద్ర, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ బద్రీ నారాయణ, కాణిపాకం ట్రస్ట్ బోర్డు మాజీ సభ్యులు నరసింహులు శెట్టి, శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం ఛైర్మన్ పామిడి సత్యనారాయణ తదితరలు పాల్గొన్నారు.

మామిడి మద్దతు ధర అమలుకోసం తహశీల్దార్ ఆఫీస్ వద్ద నిరసన

ప్రజాశక్తి - కేవీబి పురం: మామిడి పంటకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర అమలు కొరకు కేవీబీ పురం మండల తహశీల్దార్ ఆఫీస్ వద్ద జరిగే నిరసన కార్యక్రమంలో మామిడి రైతులు పాల్గొని జయప్రదంచేయాలని రైతు సంఘం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పూర్వ జిల్లా అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి జనార్ధన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ కింటా 12 వేల రూపాయల వంతున కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించినప్పటికీ ఆచరణలో అమలు జరగడం లేదని విమర్శించారు. రైతుల నుండి మామిడి గుజ్జు పరిశ్రమ యజమానులు కేవలం కిలో ఐదు రూపాయలకే కొనుగోలు చేయడం దారుణమన్నారు. ఒకవైపు ముఖ్యమంత్రి, మంత్రులు, జిల్లా కలెక్టర్లు అధికారులతో సమీక్షలు జరిపి మామిడి రైతులును ఆదుకుంటామని ప్రకటించినప్పటికీ, మామిడి గుజ్జు పరిశ్రమ యజమానులు సిండికేట్‌గా రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారన్నారు. మద్దతు ధర అమలు కోసం మండలంలోని రైతులందరూ పార్టీలకతీతంగా సోమవారం తాసిల్దార్ ఆఫీస్ ఎదుట నిరసన చేద్దామని పిలుపునిచ్చారు.